జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 7-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 156 పేజీలు: 8 వెల : రూ.7

## కరుణించాల్సిన నాడే.. కాటేసింది

* నాగులచవితి రోజున ఏడుగురిని కాటేసిన నాగేంద్రుడు
* బుధవారం మరో ఇద్దరు
* రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులు



**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 6 (వార్త):** కాపాడు.. కరుణించు అని.. నాగులచవితి రోజున పుట్ట వద్దకు వెళ్లి పాలు పోసి పూజ చేసి ఇంటికి వస్తుండగా నాగేంద్రుడు కాటేసిన వైనం శ్రీకాకుళం జిల్లాలో చోటుచేసుకుంది. మంగళవారం ఏడుగురు, బుధవారం ఇద్దరు మొత్తం కలిపి తొమ్మిది మంది పాముకాటుకు గురయ్యారు. నాగుల చవితి కావడంతో మంగళవారం పుట్టలో పాలుపోసి ఇంటికి వస్తుండగా ఒకరు, పొలానికి వెళుతుండగా మరొకరు, పశువుల శాలలో ఎండుగడ్డి తీస్తుండగా ఇంకొకరు.. పొలం పనిచేస్తుండగా, తోటలో గడ్డి కోస్తుండగా.. ఇలా పలువురిని ఆయా గ్రామాల్లో పాము కాటేసింది. గార మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఒకేరోజు పాము కాటుకు గురయ్యారు. పాముకాటుకు గురైన వారంతా శ్రీకాకుళం రిమ్స్ (సర్వజనాసుపత్రి)లో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వారంతా కోలుకుంటున్నారు. నాగుల చవితి రోజున పలువుర పాము కాటుకు గురికావడంతో వారి వారి కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. గార మండలం రెడ్డిపేటకు చెందిన బి.నీలాచరణ్, ఎల్.రాజు, పోలాకి మండలం తలసముద్రంనకు చెందిన పి.శంకరరావు, గార మండలం మంగళవారంపేటకు చెందిన బి.ఆదెమ్మ, జి.సిగడాం మండలం మదుపాం గ్రామానికి చెందిన జె.సూర్యనారాయణ, శ్రీకాకుళం రూరల్ మండలం కిష్టప్పపేటకు చెందిన వి.శార్వాణి, ఆమదాలవలస మండలం గోపీనగరానికి చెందిన ఎం.కళ్యాణ్ కుమార్‌లు మంగళవారం పాము కాటు బారిన పడ్డారు. అలాగే బుధవారం





మరో ఇద్దరిని పాము కాటేసింది. వీరంతా ప్రస్తుతం శ్రీకాకుళంలో చికిత్స పొందుతున్నారు.



## బెల్ట్‌పై.. తగ్గేదేలే!

* గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు * మద్యం దుకాణాల నుంచి తరలిపోతున్న మద్యం * జనవాసాల మధ్య మద్యం, బెల్టు దుకాణాలు * రాజకీయ నేతల అండదండలతో పేట్రేగిపోతున్న నిర్వాహకులు * ప్రజలు ఆందోళనకు దిగినా పట్టించుకోని నిర్వాహకులు * కళ్లుమూసుకున్న పోలీసు, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

**జలుమూరు నవంబర్ 6(వార్త):** గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే బెల్ట్ తీస్తా.. అని సీఎం చంద్రబాబు నాయుడు హెచ్చరికలు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదు. కోట్లు పెట్టి మద్యం షాపులు పెట్టామని బెల్టు షాపులకు మద్యం తరలించకపోతే వ్యాపారం ఎలా జరుగుతుందన్న ఉద్దేశంతో నిర్వాహకులు ఉన్నారు. బెల్టు షాపులకు జోరుగా మద్యం తరలిస్తూ వ్యాపారులు కాసులు చేసుకుంటున్నారు. ఇప్పటికే పలుచోట్ల నిబంధనలు పాటించకుండా మద్యం దుకాణాలను నిర్వాహకులు పెట్టేశారు. జనావాసాలు, పాఠశాలలు, ఆలయాల సమీపంలో మద్యం షాపులు వద్దంటూ ప్రజలు రోడ్డెక్కి ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నా నిర్వాహకులు మాత్రం పట్టించుకోవడం లేదు. మా వెనుక ఎమ్మెల్యే అనుచరులు ఉన్నారని, తమకేం చేయలేరనే ధీమాతో వ్యవహరిస్తున్నారు. ఈ విషయం పోలీసులు, ఎక్సైజ్ అధికారులు, సిబ్బందికి తెలిసినా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. జలుమూరు మండలం తిలారు ఆర్ఎస్‌లో లైసెన్స్ దుకాణాలకు ధీటుగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి పక్కనే ప్రత్యేక గదిని ఏర్పాటు చేసుకుని బాహాటంగానే మద్యం అమ్మకాలు చేస్తుండడం గమనార్హం.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 8న జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు


**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 6 (వార్త):** జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు ఈ నెల 8న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎల్ ఎన్ వి శ్రీధర్ రాజు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీచేశారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు స్థాయి సంఘాల సమావేశం ప్రారంభం అవుతాయన్నారు. ఉదయం 10గంటలకు 2వ స్థాయి, 11 గంటలకు 4వ స్థాయి, మధ్యాహ్నం 12 గంటలకు 1వ స్థాయి సంఘం సమావేశం ఉంటుందన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు 7వ స్థాయి, 3 గంటలకు 6వ స్థాయి, సాయంత్రం 4గంటలకు 3వ స్థాయి, సాయంత్రం 5 గంటలకు 5వ స్థాయి సంఘ సమావేశాలు జరగనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

### కూటమి ప్రభుత్వంతోనే..

# గ్రామాల అభివృద్ధి

*** ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ * మూలసవలాపురంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన**

**ఆమదాలవలస/సరుబుజ్జిలి, నవంబర్6(వార్త):** కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. బుధవారం మూలసవలాపురం పంచాయతీలో రూ.58.35 లక్షలు, పెద్ద సవలాపురం పంచాయతీలో రూ.87 లక్షలతో నిర్మించనున్నట్లు సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. గత ఐదేళ్లలో నియంతృత్వ పాలన సాగిందన్నారు. దాచుకోవడం, దోచుకోవడమే తప్ప గ్రామాల అభివృద్ధి ఎక్కడా జరగలేదన్నారు. ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ ప్రాంతాల






అభివృద్ధికి ఎటు వంటి చర్యలు తీసుకోలేద న్నారు. ప్రస్తుతం కూటమి పాలనలో రాష్ట్రంలోని అన్ని ప్రధాన రహదారులను గుంతల రహిత రోడ్లుగా మార్చడానికి సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా నిధులు విడుదల చేశారన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థని పూర్తిగా నాశనం చేసి నిర్లక్ష్యం చేశారన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమం నిజంగా పల్లెలకు పండగే అని వెల్లడించారు. సర్పంచ్‌లు తర్లాడ ఈశ్వరరావు, పల్లి సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, కూటమి నాయకులు తర్లాడ సురేంద్ర, శివ్వాల సూర్యనారాయణ, నందివాడ గోవిందరావు, అంబళ్ల రాంబాబు, ఎంపీడీవో ఎం.పావని, ఏపీవో పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలతో మేలు

### ఎమ్మెల్యే బెందాళం అశోక్

**ఇచ్ఛాపురం, నవంబరు 6(వార్త):** ఉద్దాన ప్రాంతం ప్రజలు కిడ్నీ మహమ్మారితో బాధపడుతున్నారని, వారికి ముందస్తుగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం ఎంతో మంచిదని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రైజ్ సంస్థల అధినేత డాక్టర్ ప్రవీణ్ పుల్లెట ఆధ్వర్యంలో విశాఖ మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో మెగా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల క్యాంపును ఎమ్మెల్యే ప్రారంభించారు. వైద్యులతో మాట్లాడి క్యాన్సర్ వ్యాధిని ఎలా గుర్తించాలి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్ర త్తలను అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి నందకి జాని, రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ, వార్డు కౌన్సిలర్లు కాళ్ల దిలీప్, పత్రి తవిటయ్య, సీపాన రమణ, దక్కత ఢిల్లీరావు, సహ దేవ్‌రెడ్డి, కాళ్ల జయదేవ్, కొరాయి ధర్మరాజు, రాజు పుల్లెట, రెయ్యి జానికిరావు, శేఖర్, డి.కా మేష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.దేవేంద్ర రెడ్డి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యోగ భద్రత కల్పించండి

### వెలుగు ఉద్యోగులు ధర్నా

**కొత్తూరు, నవంబర్ 6 (వార్త):** నాలుగు నెలల వేతన బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వెలుగు ఉద్యోగులు బుధవారం కొత్తూరు మండల మహిళా సమైక్య కార్యాలయం రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ మద్దతుతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా యానిమేటర్లు యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శి సతివాడ బాలామణి, గొర్లె శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యానిమేటర్లు 3సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. కొత్త వి.ఓ.ఏ లకు వేతనాలు చెల్లించి సి.బి.ఓ.హెచ్.ఆర్ పాలసీను అమలు చేసి 15 సంఘాల లోపు ఉన్న వి ఓ.ఏ లకు వేతనాలు చెల్లించాలన్నారు. ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని, వి.ఓ.ఎ ల మెర్జ్ వలన ఉపాధి కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని, మహిళా మార్టులలో సరకుల కొనుగోలుకు బలవంతపు టార్గెట్లు ఇచ్చే పద్ధతి రద్దు చేయాలని, యాప్‌లు వర్క్ కోసం 5జి మొబైల్‌ను ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యానిమేటర్లు యూనియన్ నాయకులు బిల్లింగి బెనర్జీ, పి.చిన్నమ్ముడు, జి.ధనలక్ష్మి, డి.జయంతి తదితరులు పాల్గొన్నారు.



## రిటైర్డు వైద్యుడు యయాతి మృతి



**సారవకోట, నవంబర్ 6 (వార్త):** సారవకోట మండలం బుడితి గ్రామానికి చెందిన రిటైర్డు వైద్యుడు మెండ యయాతి బుధవారం మృతి చెందారు. మండలంలో ఆయనకు మంచి పేరు ఉంది. వైద్యునిగా ఎంతో కాలం పాటు ప్రజలకు సేవలు అందించారు. అతనికి భార్య విజయమ్మ, కుమారుడు మెండ మురళీధర్, కుమార్తె మెండ సుధారాణి ఉన్నారు. కుమారుడు బుడితి ఎంపీటీసీగా, కుమార్తె, అల్లుడులు నరసన్నపేట, పాతపట్నం ఏరియాసుపత్రి సూపరింటెండెంట్లుగా ఉన్నారు. యయాతి మృతి పట్ల ప్రజాప్రతినిధులు, స్నేహితులు, వైద్యులు, స్థానికులు సంతాపం వ్యక్తం చేశారు.



## వానరానికి అంత్యక్రియలు

**కంచిలి, నవంబర్ 6 (వార్త):** మండలంలోని జాతీయ రహదారికి ఆను కుని ఉన్న బూరగాం గ్రామం కూడలి వద్ద రోడ్డు దాటుతున్న వానరాన్ని వేగంగా వచ్చిన కారు బలంగా ఢీ కొట్టింది. బుధవారం ఉదయం పలాస నుంచి ఇచ్ఛాపురం వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం వానరాన్ని ఢీకొట్టడంతో అక్కడక్కడే మృతి చెందినది. దీంతో ఆ మృత దేహాన్ని స్థానికంగా ఉన్న గణిత అవధాని మద్దు తిరుపతి రావు, యువకులు పరపతి జగదీష్, బుడ్డ మహేష్, వంక రమణ, ఆబోతు ఢిల్లీరావు, మణి పాత్రో తదితరులు స్పందించి వానరానికి కర్మలు నిర్వహించారు. గొయ్యి తవ్వి పూజ కార్యక్రమాలు నిర్వహించి, పూడ్చిపెట్టారు. ఎంతో ప్రమాదకరమైన బూరగాం కూడలివద్ద అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు ప్రజాప్రతినిధిలకు, అధికారులకు గతంలో ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండాలంటే తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రబీలో ఆరుతడి పంటలతో అధిక ఆదాయం

**సంతబొమ్మాళి, నవంబర్6(వార్త):** రానున్న రబీ పంటకాలంలో రైతులు ఆరుతడి పంటల సాగుతో అధిక ఆదాయం పొందే ప్రయత్నం చేయాలని సంతబొమ్మాళి మండల వ్యవసాయాధికారి రాళ్లపేట అప్పారావు సూచించారు. మండలంలోని ఆనందపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆరుతడి పంటలైన వేరు శెనగ, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న వంటి వాణిజ్యపరంగా ప్రాధాన్యత గల పంటలు సాగుచేసి అధిక ఆదాయం పొందవచ్చని, మండలంలోని అన్ని గ్రామాలు ఆరుతడి పంటల సాగుకు అనువైనవని తెలిపారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతులు శవ్వాన ప్రసాదరావు, యర్నాగుల అప్పారావు, పడాల వెంకటరమణ, సిద్ద జగన్నాధ రావు, సిద్ధమన్మధరావు, సిద్ధా ధర్మరావు, దాసరి భాస్కరరావు, సిద్ధ శంకర్రావు, గ్రామ వ్యవసాయ సహాయకులు మెండ పావని తదితరులు పాల్గొన్నారు.

## 8న నరసన్నపేటకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాక

**శ్రీకాకుళం టౌన్, నవంబరు 6(వార్త):** నరసన్నపేట మండలంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఈనెల8న పర్యటించనున్నారు, సంభందిత కమిషన్ ప్రధాన కార్యాలయం గుంటూరు జిల్లా మంగళగిరి నుండి విడుదల చేశారు. మంగళగిరి నుండి గురువారం రాత్రి రోడ్ మార్గాన బయలుదేరనున్న ఆయన శుక్రవారం ఉదయం నరసన్నపేటకు చేరుకోనున్న ఆయన ఉదయం 10 గంటలకు ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో ఆర్టీసీ యాజమాన్యం నూతనంగా ఏర్పాటు చేసిన తల్లిపాలు కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. 11 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బాల్య వివాహాలు నిర్మూలనలో వివిధ శాఖల అధికారుల సమన్వయంపై జరగనున్న సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.30 ని.లకు మండల పరిషత్ సమావేశ మందిరంలో బాలల హక్కుల పరిరక్షణలో స్థానిక ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల పాత్రపై జరగనున్న సమావేశంలో పాల్గొంటారు. భోజన విరామానంతరం ప్రైవేటు పాఠశాలలు,కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేయనున్నట్టు తెలిపారు, అనంతరం రోడ్ మార్గాన మంగళగిరికి తిరిగి పయనం కానున్నారు.

## 13న శ్రీకూర్మంలో తెప్పోత్సవం

**శ్రీకాకుళం టౌన్, నవంబర్ 6 (వార్త):** గార మండలం, శ్రీకూర్మం గ్రామంలో వేంచేసియున్న కూర్మనాథ స్వామి వారి తెప్పోత్సవం ఈనెల 13వ తేదీ (క్షీరాబ్ది ద్వాదశి) బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు శ్వేత పుష్కరిణిలో అత్యంత వైభవముగా నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ జి.గురునాధరావు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్న దృష్ట్యా వారికోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

## రోడ్డు పనుల పరిశీలన

**సారవకోట, నవంబర్ 6(వార్త):** కుమ్మరిగుంట పంచాయతీ సోమయ్య పేట గ్రామంలో జరుగుతున్న రోడ్డు పనులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బిసి కమిటి అధికార ప్రతినిధి ధర్మాన తేజ్ కుమార్ పరిశీలించారు. రోడ్డు పనుల నిర్మాణంలో నాణ్యత ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట కుమ్మరిగుంట పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు సూరపు రమేష్, కుంచి రాము, నివగానా రవి, మదనాపురం మాజీ సర్పంచ్ కొనారి సింహాచలం, సారవకోట మండల తెలుగుదేశం పార్టీ యువనాయకుడు పిళ్ళా నందకిషోర్ ఉన్నారు.

## పుస్తెల తాడు చోరి

**పాతపట్నం, నవంబర్ 6(వార్త):** కొరసవాడ గ్రామం రెడ్డిక వీధికి చెందిన అమర శ్రీలత మంగళవారం రాత్రి కుటుంబంతో తన గృహంలో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి రెండు తులాల బంగారు పుస్తెల తాడును అపహరించుకుపోయాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ సింహాచం తెలిపారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# అప్రమత్తంగా ఉండండి

**పలాస, నవంబర్ 6(వార్త):** పలాసలో రోజురోజుకు జరుగుతున్న పరిణామాల రీత్యా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. శ్రీకాకుళం నుంచి పోలీసులను రప్పించి సీఐ మోహనరావు ఆధ్వర్యంలో మున్సిపల్ ప్రాంతంలో నిఘా పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ సమస్యాత్మక ప్రాంతంలో సాయంకాలం 5 నుంచి రాత్రి 10 వరకు నిఘా పెట్టి ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇందుకు పలాస పట్టణవాసులు సహకరించాలని కోరారు. ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక ద్విచక్ర వాహనాన్ని పరిశీలిస్తున్నామన్నారు. వాహనాలను మైనర్లు నడిపినట్లయితే ఆ వాహనాలను వెంటనే పోలీస్‌స్టేషన్ తరలిస్తున్నామన్నాని తెలిపారు. అనంతరం వారి తల్లిదండ్రులను రప్పించి కౌన్సెలింగ్ ఇస్తున్నామని చెప్పారు. ఎవరూ మైనర్లకు వాహనాలకు ఇవ్వొద్దని కోరారు.

# మహిళా సాధికారతకు కట్టుబడ్డాం



**సారవకోట, నవంబర్ 6(వార్త):** మహిళల అభ్యున్నతికి, సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం ఆయన సారవకోట మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సమస్యలు అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేయాలని నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. దీపం – 2 పథకం ద్వారా పేద మహిళలకు ఏడాదికి ఉచిత సిలిండర్లు అందజేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కూపంలో నెట్టి వేసిందని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేనంతగా పింఛన్లు పెంపు చేశామన్నారు. ఎన్నికల హామీ మేరకు సూపర్ సిక్స్ ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, తహసీల్దార్, ఎంపీడీవో, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో మహిళలకు మేలు

**-సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు**

**మందస, నవంబర్ 6(వార్త):** రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో మహిళలకు మేలని సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. మందస మండల సమాఖ్య కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పీవో) లీడర్లకు బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్క ఎఫ్‌పీవో ఆయా ఏరియా ప్రాధాన్యతను బట్టి బిజినెస్ ప్లాన్ తయారుచేసుకోవాలన్నారు. ఫామ్, నాన్‌ఫామ్ ద్వారా ఆదాయం పెంచుకునేటట్లు ఎఫ్‌పీజీ లీడర్స్‌కు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. మెరుగైన ఉత్పత్తి పద్ధతుల అమలు, కలిసికట్టుగా ఎరువులు, మందులు, సామగ్రి కొనుగోలు, మార్కెట్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఉత్పత్తి ప్రణాళికలు తయారు చేయడం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో ఇన్‌చార్జి సీసీ కిషోర్, సీసీలు మీనాక్షి, మంగమ్మ, బాలకృష్ణ, అకౌంటెంట్ కల్యాణి, ఎఫ్‌పీవో లీడర్లు పాల్గొన్నారు.



ఎఫ్‌పీవోలకు శిక్షణ ఇస్తున్న సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు

# అమరవీరుల స్మారక సభను విజయవంతం చేయండి




**పలాస, నవంబర్ 6(వార్త):** మగ్రిపాడులోని గణపతినగర్‌లో ఈనెల 22న జరగనున్న శ్రీకాకుళం సాయుధ పోరాటం అమరవీరుల 46వ స్మారక సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు గొరకల బాలకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన ఈ కార్యక్రమ కరపత్రాన్ని ప్రజా సంఘాలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం సాయుధపోరాటంలో వందలాది మంది అమరులయ్యారన్నారు. అలాంటి విప్లవ పోరాట స్ఫూర్తిని,వర్గ కసిని రగిలించిన నవంబర్ 22వ తేదీ సాయుధ పోరాట చరిత్రలో నిలిచిపోయిందన్నారు. ఆ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమం సాగాలనే లక్ష్యంతో ఉద్దానం గ్రామాల్లో విప్లవోద్యమ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జీడి పంటకు గిట్టుబాటు ధర, ఉద్దానం కిడ్నీ వ్యాధి నివారణ కోసం సమరశీల పోరాటాలను నిర్మించాలని ప్రజలను సమాయత్తం చేస్తున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక చట్టాలను, నిర్ణయాలను వేగంగా అమలుకు పూనుకుంటున్నాయని విమర్శించారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన ఆరుగ్యారంటీల అమలును విస్మరించాయని ఆరోపించారు. ప్రజలు సంఘటిత పడి సమరశీల ప్రతిఘటనా పోరాటాలను నిర్మించడం ద్వారానే ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు రాపాక మాధవరావు, పీవోడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, పీవైఎల్ జిల్లా కన్వీనర్ సార జగన్, న్యూడెమోక్రసీ సీనియర్ కార్యకర్త జడ్డే అప్పయ్య, ఐఎఫ్‌టీయూ నాయకుడు పోతనపల్లి మల్లేశ్వరరావు, పలు ప్రజా సంఘాల కార్యకర్తలు గర్తం కామేశ్వరరావు, ఉటమాపతి, అప్పారావు, కొల్లి మల్లేష్, దుబ్బ బారికయ్య, రాపాక లచ్చిమయ్య, కొల్లి వరలక్ష్మి, పోతనపల్లి వాసు, బుడత మొగలింగం, బొడ్డపాడు అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రం ప్రారంభం

**పాతపట్నం, నవంబర్ 6(వార్త):** మెగా డీఎస్సీకి సన్నద్ధమవుతున్న అభ్య ర్థుల కోసం పాతపట్నంలోని మహేంద్ర జూనియర్ కళాశాలలో ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఎమ్మెల్యే మామిడి గోవింద రావు ఏర్పాటు చేశారు. మామిడి అప్పా రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తరగతులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు పరీక్షల్లో విజయం సాధించాలని ఆకాం క్షించారు. గతంలో కూడా టెట్‌కు శిక్షణ ఉచితంగా అందించామన్నారు. కార్యక్రమంలో ఆ కళాశాల యాజమా న్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.






## సర్వేను విజయవంతం చేయాలి

**పలాస, నవంబర్ 6(వార్త):** పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ అధ్యక్షతన బుధవారం మెప్మా అధికారులు, ఆర్పీలు, సీఆర్పీలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ సభ్యుల సర్వేను విజయవంతం చేయాలని కోరారు. ప్రతీ ఆర్పీ చురుకుగా పని చేసి, ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లకు సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ దాడులు



**మందస, నవంబర్ 6(వార్త):** మందస మండలంలోని గిరిజన గ్రామాల్లో ఎక్సైజ్ శాఖాధికారులు దాడులు నిర్వహించారు. సీఐ కె.బేబీ ఆధ్వర్యంలో ఎస్ఐ పి.జాన్‌ప్రసాద్, సిబ్బంది.. టబాగాం ప్రాంతంలో 960లీటర్ల పులిసిన బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. సారా తయారీ, అమ్మకాలు, ఎగుమతి చేసేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సారా అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని సీఐ బేబీ తెలిపారు.

## పాస్ పుస్తకాలను సరి చేస్తాం



**జలుమూరు, నవంబర్ 6(వార్త):** పట్టాదారుల పాసు పుస్తకాలను సరి చేసేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ జి.రామారావు తెలిపారు. బుధవారం ఆయన తిమడాంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పాసు పుస్తకాలలో లోటుపాట్లను సరిదిద్దు తామన్నారు. ఈ సందర్భంగా తొమ్మిది మంది రైతులు తమ పాసు పుస్తకాలను సరి చేయాలని అర్జీలు అందజేశారు.

## ఘనంగా అన్నసంతర్పణ

**కాశీబుగ్గ, నవంబర్ 6 (వార్త):** నందన్న ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం కాశీబుగ్గలో అన్నసంతర్పణ నిర్వహించారు. ప్రజలు వేల సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జన్ని జయరాజు, జన్ని ఉదయ్‌శంకర్, జన్ని విజయ్. జన్ని వినోద్, జన్ని లక్ష్మీకాంత్, తరుణ్ రమేష్, ఆర్ఎంపీ కొండల వెంకటేష్. కైలాస్‌నాయక్, కొండల ప్రసాద్, బత్తుల సురేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త శాఖ ప్రారంభం

**జలుమూరు, నవంబర్ 6(వార్త):** నరసన్నపేటలో బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన బ్రాంచ్‌ను, ఆగ్రోటిక్ వ్యవసాయానికి సంబంధించిన వివిధ యంత్రాలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు వ్యాపారాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోట బొమ్మాళి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





## సూర్యోదయలో డిజిటల్ తరగతుల ప్రారంభం

**మందస, నవంబర్ 6(వార్త):** మందసలో గల సూర్యోదయ స్కూల్లో డిజిటల్ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. పాఠశాల డైరెక్టర్, కరస్పాండెంట్ మోణంగి నాగేశ్వరరావు, కళ్యాణి దంపతులు ప్రత్యేక పూజలు చేసి, డిజిటల్ పరికరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ పిల్లి లోకేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా, విద్యార్థులను మరింత విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడానికి డిజిటల్ తరగతులను ప్రారంభించామన్నారు. విద్యార్థులకు సబ్జెక్టులను డిజిటల్ విధానంలో బోధిస్తామన్నారు. అదనపు తరగతి గదులను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పడాల ధర్మారావు, కొర్రాయి తులసీదాసు, కుణితి మంజు, మనీషా, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## 70మందికి కంటి పరీక్షలు




**మందస, నవంబర్ 6(వార్త):** హరిపురంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 70 మందికి పరీక్షలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నిర్మూలన సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ జరిగిన ఈ శిబిరంలో నేత్ర వైద్య సహాయకుడు శివప్రసాద్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. 20 మందికి ఆపరేషన్లు అవసరంగా గుర్తించారు. వీరిని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌చార్జి టి.రామారావు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



**జలుమూరు, నవంబర్ 6(వార్త):** ప్రభుత్వం పల్లెల్లో ఉన్న ప్రజలకు వైద్య సదుపాయాలు అందజేసేందుకు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తోందని మాకివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి విజయకుమార్ తెలిపారు. నరసన్నపేట మండలం కంబకాయ సచివాలయ పరిధిలో బుధవారం ఉచిత శిబిరాన్ని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించామన్నారు. వారికి వైద్య సేవలు అందించమన్నారు.

## జీవో నెంబర్7 ప్రకారం వేతనాలు చెల్లించాలి

**జలుమూరు, నవంబర్ 6(వార్త):** జీవో నంబర్ 7 ప్రకారం వేతనాలను వెంటనే చెల్లించాలని 104 సిబ్బంది డిమాండ్ చేశారు. బుధవారం మాకివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విజయ్‌కుమార్ నరసన్నపేట 104 డీఈవో కుసుమ కుమారి, పైలట్ వెంకట్‌రావు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతిపత్రంలో కోరారు.



# సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

**పాతపట్నం, నవంబర్ 6(వార్త):** సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. బుధవారం ఆయన పాతపట్నం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వీటిని 15 రోజుల్లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ పాలనలో ప్రజా సమస్యలు గాలికి విడిచిపెట్టడంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉన్న చందంగా పేరుకుపోయాయన్నారు. ఈ కార్యక్రమానికి పోటెత్తిన అర్జీదారులే ఇందుకు నిదర్శనమన్నారు. ముఖ్యంగా ప్రజాదర్బార్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో భూ వివాదాలు, విద్యుత్ కోతలు, రహదారులు, తాగునీటి సమస్యలతో పాటు రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణాల మంజూరు తదితరులు ఉన్నాయి. కార్యక్రమంలో రెవెన్యూ, విద్యుత్, ఆరోగ్య, ఐటీడీఏ, ఐసీడీఎస్, మండల పరిషత్తు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# డీలర్లూ.. ప్రజలకు అందుబాటులో ఉండండి



**వజ్రపుకొత్తూరు, నవంబర్ 6(వార్త):** డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండి సరుకులు పంపిణీ చేయాలని వజ్రపుకొత్తూరు మండల టీడీపీ అధ్య క్షుడు, మాజీ ఎంపీపీ సూరాడ మోహనరావు, ఎంపీపీ గొరకల వసంతస్వామి అన్నారు. బుధవారం పల్లివూరు పంచాయతీ పరిధిలోని మురిపింటివానిపేటలో నూతన రేషన్ డిపోను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహనరావు, వసంతస్వామి మాట్లాడుతూ లబ్ధిదారులకు సరుకులు ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. మురుపింటివానిపేట గ్రామంలో ఒక నెల ప్రజలకు సరుకులు ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలించారని, దీంతో ఆ డీలర్లను వెంటనే తొలగించి కొత్త డీలర్‌ను నియమించామని తెలిపారు. టీడీపీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు కూడా ఉపాధి కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు మురిపింటి పాపారావు, టీడీపీ నాయకులు వంక రామారావు, వంక శాంతారావు, అరసవెల్లి ఉమామహేశ్వరరావు, మురిపింటి భేతాళరావు, రెయ్యపాడు మాజీ సర్పంచ్ సైన బాలాజీ, సూళ్ల శాంతారావు, సూళ్ల నరేష్, కొండూరు ఎంపీటీసీ సభ్యుడు సూళ్ల చిట్టిబాబు, పీఎం పురం ఎంపీటీసీ మాజీ సభ్యుడు గత్తం దానేసు, కొత్త డీలర్ మురిపింటి లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నెత్తిన విద్యుత్ భారం



**కాశీబుగ్గ, నవంబర్ 6 (వార్త):** కూటమి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుత్ భారం ప్రజల పైన మోపుతోందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు విమర్శించారు. బుధవారం ఆయన పలాసలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ట్రూఅప్ చార్జీల పేరిట వినియోగదారుల నుంచి రూ.6072 కోట్లు అదనపు విద్యుత్ బిల్లుల వసూళ్లకు రాష్ట్ర ప్రభుత్వం ఒడిగట్టడం దారుణమన్నారు. నిత్యావసర వస్తువుల ధరలన్నీ నింగిని తాకి సాధారణ మధ్యతరగతి ప్రజలు జీవించడమే కష్టమైన కాలంలో, ఈ చార్జీల పెంపు వారిపై సమ్మెట పోటు వంటిదన్నారు. తామ అధికారంలోకొస్తే కరెంట్ బిల్లులు నియంత్రిస్తామన్న చంద్రబాబు ప్రజలను మోసం చేయడం సరైనది కాదన్నారు. తక్షణమే ట్రూఅప్ చార్జీలు ఉపసంహరించుకోవాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ వైఖరి మారకుంటే ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఇఫ్టూ జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు తదితరులు ఉన్నారు.

# పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు పునరుద్ధరించాలి



**కాశీబుగ్గ, నవంబర్ 6 (వార్త):** పలాస ఆర్టీసీ డిపో సమస్యలపై ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం ఆర్టీసీ డిపో గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ఇటీవల పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లు సుమారు 30 సర్వీసులు యాజమాన్యం నిలిపివేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే నిలిపివేసిన బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎంఏ రాజు, కార్యదర్శి ఏడీ కుమార్, కేఏ రావుతో పాటు 70 మంది ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పేదలకు నిత్యావసరాల పంపిణీ



**వంగర, నవంబర్ 6(వార్త):** కొప్పరవలస శ్రీసత్యసాయి సేవా కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెలా ఐదుగురు పేదలకు నిత్యావసర సరుకులు ఉచితంగా అందిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఒక్కొక్కరికి 10 కేజీల బియ్యం, 1కేజీ కంది పప్పు, లీటర్ నూనె, కేజీ బంగాళాదుంపలు, కారం, పసుపు పేస్ట్, సబ్బు మొదలగు నిత్యావసర వస్తువులు పేదలకు అందించారు. కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు సాదెం వెంకటరమణ, మజ్జి రాజబాబు, సాదెం కూర్మినాయుడు, సొంగ అప్పలనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు




**సారవకోట, నవంబర్ 6(వార్త):** భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తోందని, రైతులు వాటిని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సారవకోట మండలం అంగూరులో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గత సర్వేలో లోపాలు ఉన్నట్లయితే రైతులు దరఖాస్తులు చేసుకోవాలని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. రీ సర్వేలో పొరపాట్లను సరిదిద్దుందుకే రెవెన్యూ సభలు నిర్వహిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ చట్టం తెచ్చి భూ యజమానుల నుంచి భూమిని కాజేసేందుకు పన్నాగం చేసిందన్నారు. సమస్యకు సంబంధించి అవసరమైతే ఫీల్డ్‌కి వచ్చి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సర్వేయర్‌లందరూ క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే నిర్వహించాలని సూచించారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ సంస్కృతిని కాపాడండి

**జలుమూరు, నవంబర్ 6(వార్త):** ఆదివాసీ సంస్కృతీ, సంప్రదాయాలు ఆచార వ్యవహారాలు కాపాడాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి కోరారు. బుధవారం న్యూఢిల్లీలో జరిగిన జాతీయ సెమినార్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. కనుమరుగవుతున్న ఆదివాసీల సంస్కృతీ, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. కొండ కోనల్లో జీవిస్తున్న ఆదివాసీల ఆచార వ్యవహారాలపై ప్రభుత్వాలు అధ్యయనం చేయాలని కోరారు. వీరి జీవన విధానం మెరుగుపరిచేలా పరికరాలు ప్రభుత్వం అందజేయాలని సూచించారు. ఏపీలో ఓట్ల కోసం అగ్రకులాలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ తీర్మానం చేయడంతో నిజమైన ఆదివాసీలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సెమినార్‌లో ప్రొఫెసర్స్ బీకే పాణిగ్రహి, ధర్మేంద్ర రౌత్, గంగాసహయ్ మీనా తదితరులు పాల్గొన్నారు.




# 17న శ్రీముఖలింగం నుంచి బాలియాత్ర

**జలుమూరు, నవంబర్ 6(వార్త):** ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగంలో ఈనెల 17న ప్రారంభించే బాలి యాత్రను కళింగ సామ్రాజ్యవాదులంతా ఐకమత్యంతో విజయవంతం చేయాలని ఆ కమిటీ సభ్యులు కోరారు. బుధవారం వారు విలేఖరులతో మాట్లాడారు. ఈ యాత్ర ఒక సాహస యాత్రగా వారు అభివర్ణించారు. ఐదు వేల సంవ త్సరాల క్రితం చేపట్టిన ఈ యాత్రను మళ్లీ ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆ యాత్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## జాబ్ మేళాలో 40 మంది ఎంపిక

**పలాస, నవంబర్ 6(వార్త):** పలాస గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్‌లో బుధవారం జరిగిన జాబ్‌మేళాలో అంజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫాక్స్‌కాన్, ఆపిల్ సెల్, సోలార్ ప్లానింగ్ అసెంబ్లింగ్, టాటా ఎలక్ట్రానిక్స్, కంపెనీలు పాల్గొన్నాయి. ఈ మేళాలో కళాశాలకు చెందిన బీఏ, బీకాం, బీఎస్సీ, జెడ్‌సీఏ, గ్రూపుల్లో 50 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 40 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి, వివిధ, సబ్జెక్ట్ అధ్యాపకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

కార్యక్రమంలో అంజనా ఫౌండేషన్ చైర్మన్ నవీన్, వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, కోఆర్డినేటర్ రమణ, ప్లేస్మెంట్ ఆఫీసర్ హేమాచలం, వివిధ అధ్యాపకులు పాల్గొన్నారు






## రాష్ట్రస్థాయి పోటీల్లో వంగర విద్యార్థి జయకేతనం

**వంగర, నవంబర్ 6(వార్త):** రాష్ట్రస్థాయి పరుగు పోటీల్లో వంగర జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి కుమరాపు చందు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. చందును పాఠశాల హెచ్ఎం ముద్దాడ రమణమ్మ, ఉపాధ్యాయ సిబ్బంది బుధవారం అభినందించి బహుమతిని అందజేశారు. ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయుడు జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అపార్ నమోదు వేగవంతం



**జలుమూరు, నవంబర్ 6(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో అపార్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఎంఈవోలు బమ్మిడి మాధవరావు, ఎం.ప్రసాదరావు ఆదేశించారు. బుధవారం వారు జలుమూరు మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. తిమడాం ఉన్నత పాఠశాలలో ఈ ప్రక్రియ ఏ విధంగా కొనసాగుతుందో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. దీనిని మరింత వేగవంతంగా పూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ట్రాన్‌ఫార్మర్‌కు మరమ్మతులు

**వంగర, నవంబర్ 6(వార్త):** కింజగి పంచాయతీలోని ట్రాన్‌ఫార్మర్‌కు మరమ్మతులను బుధవారం ఎలక్ట్రికల్ ఏఈ బి.సాంబశివరావు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ సిబ్బంది చేశారు. ఇందులోభాగంగా కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. మరమ్మతుల అనంతరం విద్యుత్‌ను పునరుద్ధరించారు.


## అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



**జలుమూరు, నవంబర్ 6(వార్త):** నరసన్నపేట వీడీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంఈవో పి.దాలినాయుడు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల మానసిక ధైర్యాన్ని పెంచాలని, మంచి పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. అంగన్‌వాడీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, భోజనం రుచికరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్న ఆలయ ఈవో బాధ్యతల స్వీకరణ

**జలుమూరు, నవంబర్ 6(వార్త):** నరసన్నపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిగా మాధవి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఆమె ఆలయంలో ఇన్‌చార్జి ఈవో తమ్మినేని రవి నుంచి బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం తాను శ్రీకాకుళం గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తున్నానని, ఇక్కడ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టానని ఆమె స్పష్టం చేశారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413